# ప్రెస్ రిపోర్టు

రాజమండ్రిదగ్గిర రైలుబ్రిడ్జిమీద మద్రాసు-కలకత్తామెయిలుకు ప్రమాదం సంభవించింది. నదిలో ఎక్కువ నీటిమట్టం లేకపోయినా రైలు అతి జాగ్రత్తగా నడిపినా కూడా ఈ ప్రమాదం ఎలా సంభవించిందో ఇంజనీర్లకు అర్థంకాలేదు. పైపెచ్చు అది ఉత్త మెయిలుకూడా కాదు. మూడవపెట్టె స్పెషల్ అండ్ ఎయిర్ కండిషన్డ్. రైలులో ఒక జాతీయ నాయకుడుగారు ఎలక్షన్ల విషయంలో అర్జంటుగా ఎక్కడికో ఓట్లిమ్మని ఉపన్యాసం యిచ్చేందుకు పయనిస్తున్నారు, బెర్తుపైశయనిస్తూ ఇంజనూ నాయకుడిగారి పెట్టె, మరో నాలుగుపెట్టెలూ గోదావరి నదిలో పడిపోయినయ్. మిగతావాటికి ప్రమాదం వాటల్లలేదు. అనేకమంది ఇంజనీర్లూ, ప్రజలూ, ప్రముఖులూ, పార్టీవాళ్లూ పోగుపడి ఆందోళనపడిపోతున్నారు. రేపు ఎలక్షన్‌లలో నెగ్గుతాడని, ఆయనా ఆయన పార్టీవాళ్ళూ అంచనా వేసుకున్నారు. ఇంతలో....

ఆయనిక ఎవరికంటా పడలేదు

* * *

ఆ మర్నాడు దినపత్రికలో మొదటి పేజీలో పెద్దక్షరాలతో ప్రముఖంగా పడిన వార్త ఇది :

## ప్రముఖ రాజకీయవేత్త శ్రీ...గారి హఠాన్మరణం

స్వ. విలేకరి రాజమండ్రి

నేడు యిక్కడ 6గం॥ 22ని॥లకు జరిగిన మెయిలు ప్రమాదంలో ప్రముఖ జాతీయనాయకులు శ్రీ....గారు మరణించినట్టు అంచనా వేయబడ్డారని తెలబడానికి చింతిస్తున్నాం ఈ ప్రమాదంలో 40మందికి పైగా మృతిచెందారు. అనేకమందికి తీవ్రగాయాలయ్యాయి. పీడితుల సహాయార్థం, హైదరాబాదునుండి రెండు హెలికాప్టర్లులో వైద్యబృందాలు వచ్చినారు. 3గం॥ 13 ని॥లకు ఒక గజయీతగాడికి దొరికిన తలలేని శవాన్ని అతి జాగ్రత్తగా పరిశీలించి, ఈ విషయాన్ని అధికారులు ప్రకటించారు. వివరాలకోసం యింకా దర్యాప్తు సాగుతోంది....

ఈ సంగతి చదువుకున్న పాఠకులు కొందరు రీడింగ్‌రూమ్‌లో కూచుని సంతాప సూచకంగా గొణగొణలాడారు.

వారం రోజులు గడిచినయ్. దేశం నాలుగు మూలలా కీ॥ శే॥ శ్రీ....గా మరణానికి చాలామందిలా సంతాప సభలు చాలా చేశారు.

హఠాత్తుగా ఒక రోజున దినపత్రికలో పతాక శీర్షికలోపడిన వార్తయిది.

**శ్రీ—గారు సజీవంగా ఉన్నారు.**

ఫలానా తేదీనాడు మరణించినట్లు ప్రకటించబడిన ఈ ప్రముఖ జాతీయ నాయకులు సజీవంగావున్న వృత్తాంతం నేడిక్కడ తెలియవచ్చింది. యీ వార్త ప్రకటించేందుకు మాకు చాలా సంతోషంగావుంది. చాలాగాయాలతో ఒక చిన్న చెక్క సహాయంతోవారు ఏదో తెలియని సముద్రపుటొడ్డుకు స్పృహ తప్పి చేరారట. అక్కడ పల్లీయులు వారి దేహాన్ని తీసి శుశ్రూషలు చేయగా మూడు రోజులకు కళ్ళు తెరచి కొన్ని విషయాలు జ్ఞాపకం తెచ్చుకున్నారట. తరువాత తాపీగా కోలుకొని తమను తాము తెలుపుకొని బయటకు వచ్చేందుకు ఇంతకాలం పట్టిందట.

త్వరపడి మొదట అలా ప్రకటించినందుకు మా పాఠకుల్నీ, శ్రీ....గార్ని క్షమాపణ వేడుకుంటూ, గాఢ పశ్చాత్తాపం వెలి బుచ్చుతున్నాం.

[మిగతా వివరాలు రేపు ప్రకటించగలం—సం॥]

* * *

ఎలక్షన్లు జరిగిపోయినాయ్

ఫలితాలు ప్రకటిస్తూ ఆరోపేజీలో ఒక ప్రక్క "ఫలానా....వారు గెలవ లేదని ప్రకటించడానికి చింతిస్తున్నాం.స్వ॥ విలేకరి"అని ప్రకటించింది దినపత్రిక. ఈ వార్త చాలాకొద్దిమంది మాత్రమే చూడగలిగారు. ఈ మధ్య ఆయన ఆరోగ్యంగా గడుపుతున్నారట!

రచన : జూలై 1961, ప్రచురణ : చుక్కాని పక్ష పత్రిక 1-9-1961